
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి

5 సిద్దిపేట
శుక్రవారం 9 ఫిబ్రవరి 2024





సంక్షేమ పథకాలకు ఆటంకం

గత ప్రభుత్వంలో రేషన్‌కార్డులు లేనివారు సంక్షేమ పథకాలకు దూరమయ్యారు. ఆరోగ్యశ్రీ, ఆసరా పింఛన్, నెలవారి బియ్యం, కరోనా సహాయం, డబుల్‌బెడ్రూం ఇళ్లు, దళిత, బీసీ, మైనార్టీ బంధు, సీఎంఆర్‌ఎఫ్ తదితర పథకాల్లో రేషన్‌కార్డులను పరిగణనలోకి తీసుకున్నారు. దీంతో చాలామందికి లబ్ధి చేకూరలేదు. గత ప్రభుత్వ పాలన ముగిసేవరకు జిల్లా వ్యాప్తంగా 32వేలపైగా కొత్త రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయంటే అర్థం చేసుకోవచ్చు. ఈ కుటుంబాలన్నీ ప్రస్తుతం కొత్త రేషన్‌కార్డుల కోసం ఎదురు చూస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఆరు గ్యారంటీల పేరిట సంక్షేమ పథకాలను ఆచరణలోకి తెస్తామని ప్రకటించింది. ఇప్పటికే ఆరోగ్యశ్రీతోపాటు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తున్నారు. ఆరోగ్యశ్రీకి కొత్త రేషన్‌కార్డు తప్పనిసరిగా అవసరం. ఇక ఇందిరమ్మ ఇళ్లు, గ్యాస్ సిలిండర్, గృహజ్యోతి పథకాలకూ రేషన్‌కార్డులను పరిగణనలోకి తీసుకునే అవకాశాలు ఉన్నాయి. దీంతో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల పరిష్కారంతోపాటు కొత్తగా రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులను స్వీకరించాలనే డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి.

ఎదురుచూపులు

కొత్త రేషన్‌కార్డులు ఎప్పుడిస్తారో..!

- ఇప్పటికే 32,557 దరఖాస్తుల పెండింగ్
- 'ప్రజాపాలన'లో 20 వేలకుపైగా దరఖాస్తులు
- ఐదేళ్లుగా అందజేయని వైనం

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, ఫిబ్రవరి 8 : కొత్త సర్కారు కొలువుదీరిన తరుణంలో కొత్త రేషన్‌కార్డులు ఇకనైనా అందిస్తారనే ఆశలు అందరిలో నెలకొన్నాయి. ఏళ్ల తరబడిగా రేషన్‌కార్డులపై మీనమేషాలు లెక్కించడమే అవుతోంది. ఫలితంగా నెలవారీ బియ్యంతోపాటు సంక్షేమ పథకాలకూ దూరమవుతున్న వారి సంఖ్య వేలల్లో ఉంటోంది. తాజాగా అమలయ్యే సంక్షేమ పథకాలకూ రేషన్ కార్డు అవశ్యంగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో కొత్త రేషన్‌కార్డులు జారీ చేయాలనే డిమాండ్ పెరుగుతోంది. జిల్లాలోని 684 రేషన్‌షాపులకు సంబంధించి 2,91,445 రేషన్‌కార్డులు ఉన్నాయి. కార్డుల్లో 8,94,612 మంది సభ్యులు ఉన్నారు. ఒక్కొక్కరికి 6 కిలోల చొప్పున ప్రతీనెల 5,714 మెట్రిక్‌టన్నుల బియ్యాన్ని పంపిణీ చేస్తున్నారు.

మురిగిపోతున్న దరఖాస్తులు

కొత్త రేషన్‌కార్డులు మంజూరు చేయక దాదాపు ఐదేళ్లు గడుస్తోంది. అప్పటి నుంచి దరఖాస్తులన్నీ పెండింగ్‌లోనే ఉన్నాయి. గత ప్రభుత్వం రేషన్‌కార్డులను మంజూరు చేయడంలో తీవ్ర జాప్యం చేసింది. జిల్లాకు సంబంధించి 32,557 కొత్త రేషన్‌కార్డు దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. మీసేవ ద్వారా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించినప్పుడల్లా వందల మంది దరఖాస్తు చేశారు. మీసేవ ద్వారా చేసిన దరఖాస్తును తొలుత మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పరిశీలించి తన లాగిన్‌లో ఆమోదించాలి. ఆ తర్వాత సదరు మండల తహసీల్దార్ సైతం తన లాగిన్‌లో గ్రీన్‌సిగ్నల్ ఇవాల్సి ఉంటుంది. చివరకు జిల్లా పౌరసరఫరాల అధికారి అంగీకారంతో కొత్తకార్డు మం జూరవుతుంది. కానీ దరఖాస్తులన్నీ అధికారుల లాగిన్లలోనే మురిగిపోతున్నాయి. ప్రస్తుతం రెవె న్యూ ఇన్‌స్పెక్టర్ల లాగిన్‌లో 18,694, తహసీల్దార్ల లాగిన్‌లో 1890, డీఎస్‌వో లాగిన్‌లో 11,973 దరఖాస్తులు ఉన్నాయి. వీటికి అనుమతి తెలపడంలోనూ అనేక కారణాలు ఉన్నట్లుగా అవగతమవుతోంది.



'ప్రజాపాలన'కు దరఖాస్తుల వెల్లువ

గత డిసెంబరు 28 నుంచి జనవరి 6వ తేదీ వరకు నిర్వహించిన ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణలోనూ రేషన్‌కార్డుల అంశం చర్చకొచ్చింది. అయితే దరఖాస్తుల్లో కొత్త రేషన్‌కార్డుకు సంబంధించిన అంశం లేనప్పటికీ చాలామంది ప్రజాపాలన దరఖాస్తుతోపాటు రాతపూర్వకమైన పత్రాన్ని జతచేసి అందజేశారు. ప్రజాపాలన కార్యక్రమంలో జిల్లావ్యాప్తంగా 3.60 లక్షల దాకా దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు. కానీ కంప్యూటరీకరణలో 3.25 లక్షల దరఖాస్తులే నమోదు చేశారు. మిగతావాటిలో కొత్త రేషన్‌కార్డు దరఖాస్తులతోపాటు ఇతర దరఖాస్తులు ఉన్నట్లు తెలిసింది. ఈలెక్కన 20వేలకుపైగానే రాతపూర్వకంగా దరఖాస్తులను రేషన్‌కార్డు కోసం సమర్పించినట్లు అర్థమవుతోంది. మొత్తంగా 50 వేల కొత్తకార్డులు మంజూరు చేయాల్సిన పరిస్థితి జిల్లాలో ఏర్పడింది.

యువతే నిర్ణేతలు

లోకసభ ఎన్నికలకు తుది ఓటరు జాబితా సిద్ధం

- జిల్లాలో కొత్తగా 12,692 ఓటర్లు
- నాలుగు నియోజకవర్గాల్లో మొత్తం 9,61,361 మంది
- గడిచిన ఐదేళ్లలో 1.5 లక్షల కొత్త ఓట్ల నమోదు
- పురుషుల కంటే 18వేల ఓట్లు మహిళలే అధికం

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, ఫిబ్రవరి 8 : పార్లమెంటు ఎన్నికలకు సంబంధించిన తుది ఓటరు జాబితా సిద్ధమైంది. త్వరలోనే ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఎన్నికల సంఘం ఓటర్ల జాబితాను వెలువరించింది. గత జనవరి 31వ తేదీ వరకు కొత్త ఓట్లకు సంబంధించిన దరఖాస్తులు స్వీకరించిన విషయం తెలిసిందే. 18 ఏళ్లు నిండిన వారందరి దరఖాస్తులను పరిశీలించిన అనంతరం ఈ జాబితాను విడుదల చేశారు. నవంబరు 30వ తేదీన జరిగిన అసెంబ్లీ ఎన్నికల జాబితాతో పోల్చితే అదనంగా 12,692 మంది ఓటర్లు పెరగడం విశేషం. కేవలం 2 నెలల వ్యవధిలోనే జిల్లావ్యాప్తంగా పెద్దసంఖ్యలో ఓట్లు పెరిగేలా అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది.

జిల్లాలో హుస్నాబాద్, సిద్దిపేట, దుబ్బాక, గజ్వేల్ అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. పెరిగిన ఓటర్ల ప్రకారం అత్యధికంగా గజ్వేల్‌లో 2,79,489 మంది ఓటర్లు ఉండగా, అత్యల్పంగా దుబ్బాకలో 1,99,236 మంది ఓటర్లు ఉన్నారు. రెండు నెలల క్రితం వరకు జిల్లా వ్యాప్తంగా 9,48,669 ఓటర్లు ఉండగా పెరిగిన జాబితాలో 9,61,361 ఓటర్లు ఉన్నట్లు అధికారికంగా ప్రకటించారు. అదే విధంగా 27 మంది ఎన్‌ఆర్‌ఐ ఓటర్లు తమ పేరు నమోదు చేసుకోగా 452 మంది సర్వీస్ ఓటర్లు ఉన్నట్లు జాబితాలో పేర్కొన్నారు.

మహిళా ఓటర్లే అధికం

జిల్లాలో మహిళా ఓటర్ల హవా కనిపిస్తోంది. పురుషుల కంటే మహిళల ఓట్లే ఎక్కువగా ఉండడం అందుకు కారణంగా చెప్పవచ్చు. ప్రస్తుతం 4,71,616 మంది మాత్రమే మగవాళ్ల ఓట్లు ఉంటే 4,89,663 మంది స్త్రీల ఓట్లు ఉన్నాయి. దాదాపు 18వేల ఓట్లు అధికంగా నమోదు కావడం వల్ల వారిచ్చే తీర్పే కీలకంగా మారనున్నది. కొత్తగా పెరిగిన ఓట్లలోనూ యువతుల సంఖ్య ఎక్కువగా ఉంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు మహిళలను ప్రభావం చూపే విధంగా తమ ప్రచారాన్ని నిర్వహించాయి. మహిళల పేరిటనే పథకాలను రూపకల్పన చేసి వారిని ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. అందులో భాగంగానే కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తోంది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలోనూ గృహలక్ష్మీ పథకంతోపాటు బీడీ కార్మికులు, ఒంటరి మహిళలు, వితంతులకు ఆసరా పింఛన్లు పంపిణీ చేశారు. ఈ ప్రభుత్వంలోనూ వీటిని కొనసాగిస్తున్నారు. రాబోవు పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలోనూ మహిళలను ఆకర్షించేస్థాయిలో ప్రచారాన్ని ముమ్మరం చేస్తారని చెప్పడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు.

30 ఏళ్ల లోపు 3 లక్షల మంది ఓటర్లు..

2018 అసెంబ్లీ ఎన్నికల సమయంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న నాలుగు నియోజకవర్గాల్లో 8,55,465 ఓట్లు మాత్రమే ఉన్నాయి. గడిచిన ఐదేళ్లలో దాదాపు 1.05 లక్షల ఓట్లు పెరగగా 9,61,361కి చేరాయి. వీరంతా 18 ఏళ్ల నుంచి 23 సంవత్సరాలలోపు యువతీ, యువకులే కావడం విశేషం. జిల్లాకు సంబంధించిన ఓటర్లలో దాదాపు 3 లక్షల పైచిలుకు మంది ఓటర్లు 30 ఏళ్లలోపు వారేనని అంచనా. తాజాగా జరిగిన ఎన్నికల్లో యువకులు పెద్దసంఖ్యలో తమ ఓటు హక్కు వినియోగించుకోవడం ఆసక్తి చూపించారు. రాబోవు ఎన్నికల్లోనూ ఇదే పంథాను కొనసాగించే అవకాశం ఉంది. ఈ లెక్కన పార్లమెంటు ఎన్నికల్లో యువత నిర్ణయమే కీలకం కానున్నది. అభ్యర్థుల గెలుపోటములపై యువకులే నిర్ణేతలుగా మారనున్నారనేది స్పష్టమవుతోంది. గడిచిన ఎన్నికల్లోనూ అభ్యర్థులు యువతను టార్గెట్ చేస్తూ ప్రచారం నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో సైతం ఇదే కోణంలో ముందుకెళ్తారని చెప్పడం నిస్సందేహమే.

కొత్త ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం ఓట్లు
హుస్నాబాద్	1,21,021	1,25076	05	2,46,162
సిద్దిపేట	1,16,039	1,20,364	71	2,36,474
దుబ్బాక	96,866	1,02,369	01	1,99,236
గజ్వేల్	1,37,630	1,41,854	05	2,79,489
మొత్తం	4,71,616	4,89,663	82	9,61,361







పేదోడి ఫ్రిజ్‌కు భలే గిరాకీ

అప్పుడే ఎండలు మండుతుండడంతో చల్లని నీరు తాగనిదే దాహార్తి తీరడం లేదు. దీంతో పేద, మధ్యతరగతి ప్రజలు రంజన్ (పేదో ఫ్రిజ్) కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రం రూరల్ పోలీసుస్టేషన్ సమీపంలోని రింగు రోడ్డు వద్ద రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన వారు రంజన్‌లను విక్రయిస్తున్నారు. సైజ్‌ను బట్టి రూ.200 నుంచి రూ.500 వరకు అమ్ముతున్నారు. మట్టితో తయారు చేసిన వాటర్ బాటిళ్లను రూ.200కు ఒకటి చొప్పున విక్రయిస్తున్నారు.

- ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్

'బండ'పై భక్తిపారవశ్యం

- నేటి నుంచి పుల్లూరు బండ జాతర
- ఏకశిలపై స్వయంభూ లక్ష్మీనరసింహస్వామికి పూజలు
- మూడు రోజులపాటు ఉత్సవాలు

సిద్దిపేట రూరల్, ఫిబ్రవరి 8 : జిల్లాలో అత్యంత పురాతన క్షేత్రంగా వెలుగొందుతున్న సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని పుల్లూరు లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి జాతర శోభ వచ్చింది. శుక్రవారం మాఘ అమావాస్య రోజు ప్రారంభమయ్యే ఉత్సవాలు మూడు రోజులు పాటు కొనసాగుతాయి. వంద ఎకరాల్లోని ఏకశిల బండపై స్వయంభువుగా వెలిసిన లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకునేందుకు జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలిరానున్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలను కల్పించారు. శుక్రవారం నుంచి 12వ తేదీ వరకు ఆలయంలో విశేష పూజ కార్యక్రమాలను నిర్వహించనున్నారు.




బండపై ఉన్న గుండాలు

గండాలను బాపే గుండాలు

పరుపు బండపై మూడు గుండాలు (కోనేరు) ఉండడం, వాటిలో కాలాలకతీతంగా నీళ్లు ఉండటం ఇక్కడి ప్రత్యేకత. మాఘ అమావాస్య రోజు పుణ్యస్నానాలు ఆచరించి లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుంటే గండాలు తొలుగుతాయని భక్తుల నమ్మకం. ఇక్కడి గుండంలోని నీటిని తీసుకెళ్లి పొలాల్లో, ఇంట్లో చల్లుకున్నట్లయితే క్రిమికీటకాలు నశించిపోతాయని, ఇక్కడ ఉన్న పాలగుండంలో స్నానమాచరించి ఆలయం చుట్టూ 32 ప్రదక్షిణలు చేస్తే కోరిన కోర్కెలు నెరవేరుతాయని భక్తులు నమ్ముతారు.



పుల్లూరు ఏకశిల బండపై స్వయంభువుగా వెలసిన లక్ష్మీనరసింహస్వామి



నేడు ఏడుపాయలలో మాఘ అమావాస్య ఉత్సవాలు

మాఘ అమావాస్యను పురస్కరించుకొని ఏడుపాయల్లో ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. నేడు మంజీరా నదిలో భక్తులు పుణ్యస్నానాలను ఆచరిస్తారు. యాసంగి పంటల కోసం సింగూరు జలాశయం నుంచి నీటిని దిగువకు విడుదల చేయడంతో ఘన్‌పూర్ ఆనకట్టకు చేరుకున్నాయి. దీంతో కట్ట దిగువన ఉన్న ఏడుపాయలు జలకళను సంతరించుకున్నాయి.

7

శ్రీరస్తు శుభమస్తు

పెళ్లిభాజాలు మోగే సమయం ఆసన్నం

మూడు నెలల్లో 30 రోజులు లగ్నాలు

- ఈ నెల 11 నుంచి మాఘమాసం ప్రారంభం
- ఏప్రిల్ 28 వరకు ముహూర్తాలు.. తర్వాత మూఢాలు
- మళ్లీ శ్రావణంలో మంచి రోజులు

సిద్దిపేట క్రైం, ఫిబ్రవరి 8 : ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న మంచి ముహూర్తాలు వచ్చేశాయి. పెళ్లి భాజాలు మోగే సమయం ఆసన్నమైంది. ఈనెల 11వ తేదీన మాఘమాసం ప్రారంభమవుతుండగా శుభఘడియలు మొదలవుతున్నాయి. ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెలాఖరు వరకు మూడు నెలల్లో 30 వరకు మంచి ముహూర్తాలున్నాయి.

మాఘం, ఫాల్గుణం, చైత్రమాసాల్లో లగ్నాలు

మాఘమాసం ప్రారంభం నుంచి ఏప్రిల్ 28వ తేదీ వరకు మూడు నెలల్లో 30 లగ్న ముహూర్తాలు ఉన్నాయని పురోహితులు చెబుతున్నారు. ఏప్రిల్ 29 నుంచి మూఢం ప్రారంభమవుతుంది. దీంతో వైశాఖం, జ్యేష్ఠ మాసాల్లో వివాహ ముహూర్తాలు లేవని చెబుతున్నారు. తర్వాత ఆశాఢం శూన్య మాసం కావడంతో శుభ కార్యాలకు పనికిరాదు. మళ్లీ శ్రావణమాసం అంటే ఆగస్టు నుంచి పెళ్లిలు జరుపుకోవచ్చని సూచిస్తున్నారు. ఏటా చైత్ర శుద్ధనవమి అంటే శ్రీరామనవమి అనంతరం పెళ్లిల శుభకార్యాలు ప్రారంభమవుతాయి. ఆతర్వాత వైశాఖమాసం వేసవిలో పెళ్లిలు ఎక్కువగానే ఉంటాయి. అయితే ఈ సంవత్సరం మాత్రం వైశాఖమాసం అంతా మూఢం కావడంతో వివాహాలన్ని మాఘం, ఫాల్గుణం, చైత్రంలో అంటే ఏప్రిల్ 28వ తేదీలోపే జరిగనున్నాయి.

ముందస్తుగా ఫంక్షన్‌హాల్స్ బుకింగ్

జిల్లా మొత్తంలో వందల సంఖ్యల్లో పెళ్లిళ్లు జరుగుతుండడంతో యువతీయువకుల తల్లిదండ్రులు పెళ్లి పనులపై దృష్టి పెడుతున్నారు. ఫంక్షన్‌హాల్స్, క్యాటరింగ్, పురోహితులు, భాజాభజంత్రీలు, డెకరేషన్, ఫొటోగ్రఫీ, ఆర్కెస్ట్రా, డీజే, వీడియోగ్రాఫర్స్, ప్రీ వెడ్డింగ్ షూట్ వంటివి ముందస్తుగా బుక్ చేసుకుంటున్నారు. పెళ్లిలకు అవసరమైన పట్టుచీరలు, దుస్తులు, బంగారు ఆభరణాలు ముందుగా కొనుగోలు చేస్తున్నారు. ఫంక్షన్ హాల్స్, క్యాటరింగ్ ముందస్తుగా బుక్ చేసుకుంటున్నారు.

శుభ ముహూర్తాలు ఇవే..

మాఘమాసం ప్రారంభం అయిన తర్వాత ఈ నెల 13, 14, 15, 17, 18, 24, 28, 29, మార్చి 2, 3 తేదీల్లో మంచి ముహూర్తాలు ఉన్నట్లు పురోహితులు సూచిస్తున్నారు. ఫాల్గుణ మాసంలో మార్చి 15, 17, 20, 22, 24, 25, 27, 28, 30, ఏప్రిల్ 3, 4 తేదీల్లో శుభ ఘడియలు ఉన్నాయని, చైత్రమాసమైన ఏప్రిల్ 9, 18, 19, 20, 21, 22, 24, 26, 28 తేదీలలో పెళ్లిళ్లు జరుపుకోవచ్చని పురోహితులు తెలిపారు.

మూడు నెలలు వరుస శుభ ముహూర్తాలు



ఫిబ్రవరి 11 నుంచి ఏప్రిల్ 28 వరకు 3 నెలలు వరుసగా శుభముహూర్తాలు ఉన్నాయి. తర్వాత శుక్ర మౌఢ్యమి, గురుమౌఢ్యమి రావడంతో జూలై 11 వరకు ముహూర్తాలు లేవు. తర్వాత ఆషాఢ మాసం శూన్యమాసం కాబట్టి ఆగస్టు వరకు శుభ కార్యాలు నిర్వహించకూడదు. ఆగస్టు 7 నుంచి 28 వరకు ముహూర్తాలున్నాయి. సెప్టెంబరులో మంచి ఘడియలు లేవు. అక్టోబరు 13 నుంచి 6 వరకు, నవంబరులో ఐదు ముహూర్తాలు, డిసెంబరులో ఐదు ముహూర్తాలే ఉన్నాయి.

- కలకుంట్ల రాజేశ్వర్‌రెడ్డి, జ్యోతిష్కుడు, సిద్దిపేట



ఎస్‌ఐల బదిలీలు

సిద్దిపేట క్రైం, ఫిబ్రవరి 8 : సిద్దిపేట పోలీసు కమిషనరేట్ పరిధిలోని పలువురు ఎస్‌ఐలను బదిలీ చేస్తూ పోలీసుశాఖ నుంచి గురువారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. సిద్దిపేట సీఎస్‌బీ ఎస్‌ఐ బాలకృష్ణ చిన్నకోడూర్ పీఎస్‌కు, చేర్యాల పీఎస్ ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి రాజగోపాల్‌పేట పీఎస్‌కు, సిద్దిపేట టూ టౌన్ ఎస్‌ఐ శ్రీనివాస్ కుకునూర్‌పల్లికి, కామారెడ్డి జిల్లా మద్నూర్ ఎస్‌ఐ కృష్ణారెడ్డి బెజ్జంకికి, గజ్వేల్ టౌన్ ఎస్‌ఐ పర్శరాములు మిరుదొడ్డికి, సిద్దిపేట సీసీఆర్‌బీ ఎస్‌ఐ అపూర్వరెడ్డి సిద్దిపేట రూరల్ పీఎస్‌కు, సిద్దిపేట టూటౌన్ ఎస్‌ఐ వెంకటరెడ్డి సిద్దిపేట త్రీటౌన్‌కు, రాజగోపాల్‌పేట పీఎస్ ఎస్‌ఐ మోహన్‌రెడ్డి సిద్దిపేట సీసీఆర్‌బీకి, సిద్దిపేట త్రీటౌన్ ఎస్‌ఐ మధుసూధన్‌రెడ్డి, సిద్దిపేట వన్‌టౌన్‌కు, చిన్నకోడూర్ పీఎస్ ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ సిద్దిపేట సీసీఎస్‌కు, బెజ్జంకి పీఎస్ నరేందర్‌రెడ్డి గజ్వేల్ టౌన్‌కు, మెదక్ టౌన్ పీఎస్ ఎస్‌ఐ రవికాంత్‌రావు భూంపల్లికి, కరీంనగర్ సీసీఎస్ ఎస్‌ఐ మధుకర్‌రెడ్డి మర్కూక్‌కు, కామారెడ్డి వీఆర్ ఎస్‌ఐ శ్రీరాంప్రేమ్‌దీప్ దౌల్తాబాద్‌కు, మెదక్ జిల్లా నర్సాపూర్ ఎస్‌ఐ శివకుమార్ సిద్దిపేట టూటౌన్‌కు, కుకునూర్‌పల్లి ఎస్‌ఐ పుష్పరాజ్ మెదక్ జిల్లా నర్సాపూర్‌కు బదిలీ అయ్యారు.

కోర్కెలు తీర్చే కల్పవల్లి.. చుంచనకోట భువనేశ్వరీ

● రేపటి నుంచి శైశిరమాఘ నవరాత్రోత్సవాలు ప్రారంభం



భువనేశ్వరీ దేవీ, భువనేశ్వరీమందిరం, నారసింహీమాత(ఫైల్) , విశాల చంద్రమౌళిశాస్త్రి(ఫైల్)

చేర్యాల, ఫిబ్రవరి 8: చేర్యాల మండలం చుంచనకోట గ్రామంలోని నారసింహీ గురుస్థానం భువనేశ్వరీ మందిరం అత్యంత మహిమాన్విత క్షేత్రంగా అలరారుతున్నది. కోరిన కోర్కెలు తీర్చుతూ భక్తుల పాలిట కల్పవల్లిగా విరాజిల్లుతున్నది. ప్రతియేటా దేవీ ఆలయాల్లో దసరా సందర్భంగా నవరాత్రోత్సవాలు జరపనుండగా, ఇక్కడ మాత్రం మాఘశుద్ధ పాడ్యమిని పురస్కరించుకుని శైశిరమాఘ నవరాత్రోత్సవాలు నిర్వహించడం, మాఘశుద్ధ ద్వాదశిన ముగించడం ఆనవాయితీగా వస్తున్నది. ఈ క్రమంలో రేపటి నుంచి ఈ నెల 21వ తేదీ వరకు 11 రోజులపాటు ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరగనున్నాయి. ఈనెల 10న పూర్ణాభిషేకం, కలశ స్థాపనతో ఉత్సవాలు ప్రారంభం అవుతాయి. 14న లలితాపంచమి, డోలోత్సవం, 15న శ్రీ గురు దత్తాత్రేయ అష్టషష్ఠ్యుపచారపూజ, 16న చండీహవన ప్రారంభం, 18న మహాన్యాసపూర్వక శతరు ద్రాభిషేకం, 20న పూర్ణాహుతి, సామూహిక సత్యనారాయణ వ్రతములు, 21న కలశోద్వాసన నిర్వహించనున్నారు. దేవీ భాగవత పారాయణం, చండీ పారాయణం, దేవీ భాగవత పురాణం, చక్రి భజనలు చేపట్టనున్నట్లు తెలిపారు. అమ్మవారి దర్శనార్థం పొరుగు ప్రాంతాల నుంచి భక్తులు నిత్యం తరలివస్తూనే ఉంటారు. విదేశాల్లో స్థిరపడిన భక్తులు స్వదేశానికి రావడంతోనే అమ్మవారిని దర్శించుకుంటారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు.

జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలి

● టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య



సమావేశంలో మాట్లాడుతున్న సోమయ్య

హుస్నాబాద్, ఫిబ్రవరి 8: జర్నలిస్టుల సమస్యలను గత బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అయినా త్వరితగతిన పరిష్కరించాలని టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య కోరారు. గురువారం ఆయన హుస్నాబాద్ పట్టణంలో జరిగిన టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా మహాసభలో మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన జర్నలిస్టులను గౌరవించి ఆదుకోవాల్సిన పాలకులు విస్మరించడం సరైంది కాదన్నారు. జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు, ఉద్యోగ, ఆరోగ్య భద్రత, పెన్షన్ స్కీం, హెల్త్ స్కీం, ప్రత్యేక రక్షణ చట్టం వంటి డిమాండ్ల సాధన కోసం నిరంతరం పోరాటాలు చేస్తామన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, వైస్ చైర్‌పర్సన్ అనిత, ఐఎఫ్‌డబ్ల్యూజే కార్యదర్శి పి.ఆనందం, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్, రాజలింగం, బాపురావు, అడహక్ కమిటీ కన్వీనర్ మురళీధర్‌స్వామి, కోకన్వీనర్ ఎల్లయ్య, యూసుఫ్ పాల్గొన్నారు. అనంతరం సంఘ జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వరిమురళీధరస్వామి, కార్యదర్శిగా ఎల్లయ్య, ఉపాధ్యక్షులుగా సంపత్, సహాయ కార్యదర్శిగా రాజమల్లు, కార్యవర్గ సభ్యులుగా ఖుద్రత్‌అలీ, రాజు, రాజలింగం ఎన్నికయ్యారు.

'పది'లో ఉత్తమ ఫలితాలను సాధించాలి

● సిద్దిపేట అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్

● జడ్పీహెచ్ఎస్ ఆకస్మిక తనిఖీ



పెద్దచీకోడ్‌లో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్

దుబ్బాక, ఫిబ్రవరి 8: రానున్న పదో తరగతి వార్షిక పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించే విధంగా ఉపాధ్యాయులు విద్యాబోధన చేయాలని సిద్దిపేట అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ సూచించారు. గురువారం దుబ్బాక మండలం పెద్దచీకోడ్ గ్రామంలో జడ్పీహెచ్ఎస్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను, గ్రామంలో జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. గ్రామంలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం దుబ్బాక ఐవోసీ కార్యాలయంలో ఓటరు ముసాయిదా జాబితా సమావేశాన్ని నిర్వహించారు. దుబ్బాక నియోజవర్గంలో లక్షా 99 వేల 236 మంది ఓటర్లు ఉన్నారన్నారు. అందులో పురుష ఓటర్లు 96 వేల 866, మహిళా ఓటర్లు లక్షా 2 వేల 370 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు.

మర్పడగ మల్లికార్జునుడికి అన్నాభిషేకం

కొండపాక, ఫిబ్రవరి 8: కొండపాక మండలం మర్పడగ గ్రామంలోని విజయదుర్గా సమేత సంతాన మల్లికార్జునస్వామి క్షేత్రంలో గురువారం మాసశివరాత్రి సందర్భంగా స్వామివారికి అన్నాభిషేకం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. క్షేత్రం నిర్వాహకులు డాక్టర్ చెప్పెల హరినాథశర్మ ఆధ్వర్యంలో ఉదయం 6.30 గంటలకు గణపతి పూజతో కార్యక్రమం ప్రారంభం కాగా.. విజయదుర్గా మాతకు, సంతాన మల్లికార్జునస్వామికి పూజలు నిర్వహించారు. అనంతరం ఉదయం 10 నుంచి 1 గంటల వరకు లఘున్యాస పూర్వకంగా విశేష పంచామృత ఫలరస అభిషేకం నిర్వహించి అన్నపూజ చేశారు. ఈ కార్యక్రమంలో క్షేత్ర నిర్వహణ కమిటీ సభ్యులు గట్టు విఠల్, బాలరాజేశం, మర్యాల రవీందర్, లగిశెట్టి రాజు, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

అనుమానాస్పద వ్యక్తి బైండోవర్

సిద్దిపేట క్రైం, ఫిబ్రవరి 8: సిద్దిపేట పట్టణం నర్సాపూర్ పరిధిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు గురువారం ఓ వ్యక్తి మద్యం మత్తులో వెళ్లి రెండో తరగతి విద్యార్థి బాబాయి అని ఉపాధ్యాయులకు చెప్పి తీసుకెళ్లే ప్రయత్నం చేశాడు. అనుమానం వచ్చిన ఉపాధ్యాయులు విద్యార్థి తల్లికి ఫోన్ చేయగా.. అతనెవరో తెలియదని, బాబును పంపొద్దని చెప్పింది. దీంతో పాఠశాల సిబ్బంది డయల్ 100కు ఫోన్‌చేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు సదరు వ్యక్తిని విచారించగా.. పొంతనలేని సమాధానం చెబుతూ న్యూసెన్స్ చేయగా.. తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. ఈ సంఘటన సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. పాఠశాలకు వచ్చిన వ్యక్తి కిడ్నాపర్ కాదని, విద్యార్థి తల్లిదండ్రులకు పరిచయం ఉన్నవాడని, మద్యం సేవించి న్యూసెన్స్ చేయడం వల్లే బైండోవర్ చేశామని తెలిపారు.

నేడే ఏడుపాయలలో మాఘ అమావాస్య ఉత్సవాలు

● మాఘస్నానాలకు ఏర్పాట్లు పూర్తి



ఆలయానికి వెళ్లే మార్గంలో ప్రత్యేక క్యూ

పాపన్నపేట, ఫిబ్రవరి 8: మాఘ అమావాస్యను పురస్కరించుకొని ఏడుపాయల్లో ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. మంజీరా నదిలో పుణ్యస్నానాలు ఆచరించి.. ఇక్కడి అమ్మవారిని దర్శించుకునేందుకు రాష్ట్రం నుంచే కాకుండా వివిధ రాష్ట్రాల నుంచి సుమారు లక్ష మందికి పైగా భక్తులు వచ్చే అవకాశం ఉన్నట్లు దేవాదాయ శాఖ, పాలక మండలి సభ్యులు అంచనా వేస్తున్నారు. ఇందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ పరిసరాల్లోని నది పాయల వద్ద భక్తులు పుణ్యస్నానాలు ఆచరించడానికి మొత్తం ఏడు చోట్ల షవర్లను ఏర్పాటు చేశారు. మహిళలు దుస్తులు మార్చుకునేందుకు తాత్కాలిక టెంట్లను వేశారు. అమ్మవారి దర్శనం కోసం చలువ పందిళ్లు వేసి.. ప్రత్యేక క్యూలు ఏర్పాటు చేశారు. రాత్రి అమ్మవారి ఆలయ సన్నిధిలో బస చేసే భక్తుల సౌకర్యార్థం విద్యుద్దీపాలను ఏర్పాటు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల కోసం పార్కింగ్ స్థలాలను కేటాయించారు. పాపన్నపేట వైపు నుంచి వచ్చే వాహనాలు చెలిమెకుంట వద్ద, పోతన్‌శెట్టిపల్లి వైపు నుంచి వచ్చే వాహనాలు టేకులగడ్డ వద్ద పార్కింగ్ ఏర్పాట్లు చేశారు. భక్తుల సౌకర్యార్థం మెదక్ డిపో నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతోంది.

పాయలకు జలకళ

యాసంగి పంటల కోసం సింగూరు జలాశయం నుంచి ఈనెల 6న 350 ఎంసీఎఫ్‌టీల నీటిని దిగువకు విడుదల చేశారు. ఆ నీరు గురువారం ఘన్‌పూర్ ఆనకట్టలోకి చేరుకుంది. దీంతో ఆనకట్ట నిండుకుండలా మారింది. ఆనకట్ట దిగువన ఉన్న ఏడుపాయల్లోకి భక్తులు పుణ్యస్నానాలు ఆచరించడానికి ప్రాజెక్టు నుంచి నదీ పాయలకు విడుదల చేశారు. దీంతో పాయలన్నీ జలకళ సంతరించుకున్నాయి.

భారీ బందోబస్తు

మాఘ అమావాస్య సందర్భంగా భారీ ఎత్తున భక్తులు తరలిరానున్న నేపథ్యంలో జిల్లా ఎస్పీ బాలస్వామి ఆదేశాల మేరకు మెదక్ డీఎస్పీ ఫణిందర్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు పాపన్నపేట, మెదక్, కొల్చారం ఎస్ఐలతోపాటు బందోబస్తులో పాల్గొనే సిబ్బందితో గురువారం డీఎస్పీ సమావేశమై పలు సూచనలు చేశారు. వైద్యశాఖ ఆధ్వర్యంలో వైద్య సిబ్బందితో పాటు ఒక అంబులెన్స్‌ను ఏర్పాటు చేశారు. 20 మంది గజ ఈతగాళ్లను నియమించినట్లు మత్స్యశాఖ అధికారులు తెలిపారు.

ఏర్పాట్లు పూర్తి..

మాఘ అమావాస్య ఉత్సవాల సందర్భంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చైర్మన్ బాలాగౌడ్, ఈవో మోహన్‌రెడ్డిలు పేర్కొన్నారు. కేటాయించిన స్థలాల వద్దనే మాఘ స్నానాలు చేయాలన్నారు. భక్తులు పోలీసు, దేవాదాయ శాఖ అధికారుల సూచనలు పాటించాలని పేర్కొన్నారు. చైర్మన్, ఈవో, డైరెక్టర్‌లతో ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సౌకర్యాలు కరువు..

పుణ్యస్నానాల కోసం ఏర్పాటు చేసిన షవర్ల వద్ద ఇంకా పిచ్చి మొక్కలు దర్శనం ఇస్తున్నాయి. చెక్‌డ్యాంకు వెళ్లే మార్గం అంతా చెత్తాచెదారంతో గుంతలమయంగా మారింది. దీంతో పుణ్యస్నానాలకు వచ్చే భక్తులు ఇబ్బంది పడే అవకాశం ఉంది.



చెక్‌డ్యాం వద్ద గుంతలమయంగా ఉన్న దారి

మహిళ దారుణ హత్య

● మద్యం తాగించి, తలపై బండరాయితో మోది ..



సునీత (ఫైల్)

హత్నూర, ఫిబ్రవరి 8: వివాహేతర సంబంధం ఓ నిండు ప్రాణాన్ని బలి తీసుకుంది. మహిళతో సన్నిహితంగా ఉన్న వ్యక్తి ఆమె తలపై బండరాయితో మోది హత్య చేశాడు. ఒంటిపై పెట్రోల్ పోసి తగలపెట్టడంతో పాటు.. సగం కాలిన మృతదేహాన్ని పక్కనే నీటి గుంతలో పడేసి.. పైకి తేలకుండా బండరాళ్లు పెట్టిన ఘటన హత్నూర పోలీస్‌స్టేషన్ పరిధిలోని మాధుర గ్రామ శివారులో గురువారం వెలుగు చూసింది. పోలీసులు, కుటుంబీకుల కథనం ప్రకారం.. హత్నూర మండల పరిధిలోని గోవింద్‌రాజ్‌పల్లి గ్రామానికి చెందిన వడ్డే సునీత (35) పదేళ్ల క్రితం భర్త నుంచి విడిపోయి, తల్లిగారి గ్రామమైన గోవిందరాజ్‌పల్లిలో ఇద్దరు కుమారులతో కలిసి ఉంటోంది. గుమ్మడిదల, దౌల్తాబాద్, సంగారెడ్డి ప్రాంతాలలో అడ్డకూలిగా పని చేస్తుంది. రోజువారీ మాదిరిగానే జనవరి 31న ఉదయం పని కోసమని వెళ్లింది. రాత్రి అయినా తిరిగి రాకపోవడంతో కుటుంబీకులు బంధువుల వద్ద వెతికినా.. ఆచూకీ లభించలేదు. దీంతో ఈనెల 5న హత్నూర పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన పోలీసులు మృతురాలు సెల్‌ఫోన్ కాల్‌లిస్ట్ ఆధారంగా ముగ్గురు అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారించారు. మాధుర గ్రామానికి చెందిన మాదిగ దత్తయ్యను విచారించగా, చేసిన నేరాన్ని ఒప్పుకున్నట్లు పోలీసులు తెలిపారు. జనవరి 31న మృతురాలు సునీత, దత్తయ్యలు గ్రామ శివారులో గల దత్తాత్రేయ గుట్ట సమీపంలోని బండ పొదల్లో మద్యం సేవించి ఏకాంతంగా గడిపారు. తర్వాత ఇద్దరి మధ్య డబ్బుల విషయంలో మాటామాట పెరగడంతో కోపోద్రిక్తుడైన దత్తయ్య.. సునీత తలపై బండరాయితో మోదడంతో ఆమె అక్కడికక్కడే చనిపోయింది. దీంతో దత్తయ్య వెంటనే ఓ పెట్రోల్ బంక్‌కు వెళ్లి.. పెట్రోల్ తీసుకొచ్చి మృతురాలి ఒంటిపై పోసి నిప్పంటించాడు. పూర్తిగా కాలకపోవడంతో సమీపంలోని నీటి గుంతలో వేసి పైకి కనపడకుండా.. మృతదేహంపై రాళ్లు పెట్టి, పరారైనట్లు పోలీసులు తెలిపారు. నిందితుడు ఇచ్చిన సమాచారంతో పోలీసులు నీటిగుంతలోని మృతదేహాన్ని గురువారం వెలికి తీసి, అక్కడే పోస్టుమార్టం నిర్వహించారు. మృతురాలి సోదరుడు హనుమంతు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. సంఘటన స్థలంలో పలు ఆధారాలు సేకరించినట్లు జిన్నారం సీఐ సుధీర్‌కుమార్, ఎస్ఐ సుభాష్‌లు తెలిపారు.

శిక్షణ విమానం కూలినచోట స్మృతి చిహ్నం



రావెల్లిశివారులో విమానం కూలిన చోట ఏర్పాటు చేసిన స్మృతి చిహ్నం

తూప్రాన్, ఫిబ్రవరి 8: శిక్షణ విమానం కూలి ఇద్దరు మరణించిన ప్రదేశంలో తన కుమారుడి జ్ఞాపకార్థం తల్లి స్మృతి చిహ్నం నిర్మించారు. మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణ పరిధి రావెల్లి శివారు టాటాకాఫీ కంపెనీ వద్ద గతేడాది డిసెంబరు 4న దుండిగల్ ఎయిర్‌ఫోర్స్‌కు చెందిన శిక్షణ విమానం కూలింది. ఈ ప్రమాదంలో ఇన్‌స్ట్రక్టర్ (పైలట్) అభిమన్యురాయ్, శిక్షణ పొందుతున్న వియత్నాంకు చెందిన ఫువన్‌ట్రైన్ మృతి చెందారు. ఆ ప్రదేశంలో అభిమన్యురాయ్ తల్లి చంద్రలేఖారాయ్ స్మృతిచిహ్నం ఏర్పాటు చేయాలని భావించారు. రెవెన్యూ అధికారుల సహాయంతో శిక్షణ విమానం కూలిన ప్రదేశానికి సమీపంలో స్మృతి చిహ్నం నిర్మించారు.

దోషం చెరువు కబ్జాకు యత్నం

● రాత్రికి రాత్రే ప్రహరీ నిర్మాణం
● అక్రమార్కులకు నాయకుల అండ



చెరువు స్థలంలో నిర్మించిన ప్రహరీని కూల్చివేస్తున్న జీహెచ్ఎంసీ సిబ్బంది

పటాన్‌చెరు, ఫిబ్రవరి 8: సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని బండ్లగూడలో దోషం చెరువు స్థలాన్ని ఆక్రమించేందుకు కొందరు యత్నించారు. రాత్రికి రాత్రే సుమారు రెండెకరాల ఎఫ్‌టీఎల్ స్థలం చుట్టూ ప్రహరీని నిర్మించి స్థలాన్ని స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నించారు. విషయం తెలియడంతో గురువారం అధికారులు అక్కడకు చేరుకుని ప్రహరీని కూల్చివేశారు. గతంలో కూడా దోషం చెరువు ఎఫ్‌టీఎల్‌లో తమకు భూములు ఉన్నాయని కొందరు వ్యక్తులు పెద్దఎత్తున మట్టిని నింపడంతో అప్పట్లో తీవ్ర విమర్శలు వచ్చాయి. దీంతో కబ్జాదారులు వెనక్కు తగ్గారు. తిరిగి కొందరు స్థానిక నాయకుల ప్రోద్బలం, వెన్నుదన్నుతో బుధవారం రాత్రి ఎఫ్‌టీఎల్ స్థలం చుట్టూ ప్రహరీని నిర్మించి ఆక్రమించేందుకు ప్రయత్నం చేయడంతో దుమారం రేగింది. స్థానిక కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ స్నేహశబరీష్‌కు ఫిర్యాదు చేశారు. జోనల్ కమిషనర్ ఆదేశాలతో జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బంది ఆఘమేఘాల మీద గురువారం చెరువు ఆక్రమణలపై స్పందించారు. జీహెచ్ఎంసీ ఇరిగేషన్ డీఈ నళిని, ఏఈ పావని, సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సురేష్, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ శ్రీహరి చెరువు వద్దకు చేరుకున్నారు. ఎఫ్‌టీఎల్ స్థలంలో నిర్మించిన నిర్మించిన ప్రహరీని కూల్చివేశారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ సురేష్, కార్పొరేటర్ మెట్టు కుమార్ మాట్లాడుతూ.. చెరువులను కబ్జా చేస్తే సహించేది లేదని, నిందితులపై క్రిమినల్ కేసులను నమోదు చేయిస్తామని హెచ్చరించారు.

చెరువు తూములో పడి ఒకరి మృతి



మల్లేశం (ఫైల్)

పుల్‌కల్, ఫిబ్రవరి 8: ప్రమాదవశాత్తు చెరువు తూములో పడి ఒకరు మృతి చెందిన సంఘటన చౌటకూర్ మండలం సుల్తాన్‌పూర్ గ్రామశివారులో గురువారం సాయంత్రం జరిగింది. ఉప్పరిగూడెం గ్రామానికి చెందిన వడ్ల మల్లేశం (46) పని నిమిత్తం సుల్తాన్‌పూర్ గ్రామానికి వచ్చి, తిరుగు ప్రయాణంలో ఉప్పరిగూడెం వెళ్తున్నారు. దారిలో మల్లేశం సుల్తాన్‌పూర్ గ్రామ శివారులోని పెద్ద చెరువు మైసమ్మ దేవాలయం వద్ద ఉన్న తూము కల్వర్టుపై నిద్రకు ఉపక్రమించాడు. నిద్రలో ప్రమాదవశాత్తు ఉధృతంగా ప్రవహిస్తున్న ఆ తూము నీటిలోనే పడి ఊపిరాడక మృత్యువాత పడ్డాడు. గమనించిన స్థానికులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా, అప్పటికే మల్లేశం మృతి చెందారు. పుల్కల్ పోలీసులకు సమాచారం అందించగా, వారు వచ్చి మృతదేహాన్ని బయటకు తీశారు. పుల్కల్ ఎస్ఐ పాటిల్ క్రాంతికుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య గోవిందమ్మ, ఒక కూతురు, కుమారుడు ఉన్నారు. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని తాజా మాజీ సర్పంచ్ అల్వాల రేణుకనర్సింలు, కాంగ్రెస్ నాయకుడు కలాలి ఈశ్వర్‌గౌడ్‌లు కోరారు.

వృద్ధుడి ఆత్మహత్య

రామాయంపేట, ఫిబ్రవరి 8: ఒంటరితనానికి తోడు అనారోగ్యంతో బాధపడుతూ ఓ వృద్ధుడు ఆత్మహత్యకు ఒడిగట్టాడు. రామాయంపేట మండల పరిధి ఝాన్సీలింగాపూర్‌కు చెందిన కర్రె చంద్రయ్య (68) భార్య, కొడుకు కొన్నాళ్ల క్రితమే చనిపోయారు. దీంతో కోడలి వద్ద ఉంటున్నాడు. తరచూ అనారోగ్యానికి గురి కావడం, ఒంటరితనంతో మనస్తాపానికి గురయ్యాడు. బుధవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో దూలానికి తాడుతో ఉరి వేసుకున్నట్లు ఎస్ఐ రంజిత్ తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

రాయపోల్, ఫిబ్రవరి 8: గుర్తుతెలియని వాహనం ఢీకొని బైక్‌పై వెళ్తున్న వ్యక్తి మృతి చెందాడు. మెదక్ జిల్లా నర్సంపల్లి గ్రామానికి చెందిన ఉడుత దశరథం(36) బుధవారం దౌల్తాబాద్‌లోని బంధువుల ఇంటికి వచ్చాడు. ఆయన భార్య చేగుంట మండలం బోనాలలోని పుట్టింటి వద్ద ఉండడంతో రాత్రి బైక్‌పై దౌల్తాబాద్ నుంచి బోనాలకు బయలుదేరాడు. ఈ క్రమంలో గోవిందాపూర్ సమీపంలో గుర్తు తెలియని వాహనం దశరథం బైక్‌ను ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతిచెందాడు. మృతుని భార్య లత ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు స్టేషన్ హౌజ్ ఆఫీసర్ సాయిలు తెలిపారు.

తల్లి, కూతురు అదృశ్యం



అదృశ్యమైన లావణ్య, లాహిత్య

టేక్మాల్, ఫిబ్రవరి 8: తల్లి, కూతురు అదృశ్యమైన సంఘటన మండలంలోని అచ్చనపల్లి గ్రామంలో జరిగింది. అచ్చనపల్లిలోని తల్లిగారింటికి వెళ్లిన కడల లావణ్య(27) సోమవారం మధ్యాహ్నం అత్తగారి ఊరైన చిన్నఘనపూర్‌కు తన కూతురు లాహిత్యతో కలిసి బయలుదేరి వెళ్లింది. మంగళవారం ఉదయం లావణ్య భర్త మల్లేష్‌కు ఆమె అన్న మల్లేశం ఫోన్ చేసి అడుగగా ఇద్దరూ రాలేదని చెప్పాడు. బంధువులు, స్నేహితులను వాకబు చేసినా ఆమె జాడ తెలియలేదు. అన్న మల్లేశం గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రమేష్ తెలిపారు.

బోనాల కొండాపూర్‌లో వృద్ధురాలు



మల్లవ్వ (ఫైల్)

చేగుంట, ఫిబ్రవరి 8: వృద్ధురాలు అదృశ్యమైన ఆరు సంవత్సరాల తర్వాత పోలీసులకు ఫిర్యాదు చేశారు. బోనాల కొండాపూర్ గ్రామానికి చెందిన కారింగుల చిన్న మల్లవ్వ(68) ఆరు సంవత్సరాల క్రితం ఇంట్లో నుంచి వెళ్లిపోయి నేటికీ తిరిగిరాలేదు. ఆమె ఆచూకీ తెలిసిన వారు చేగుంట పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ హరీష్ గౌడ్ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు చేగుంట ఎస్ఐ 8712657936, చేగుంట పోలీస్ స్టేషన్ 8712657893 నంబర్లకు తెలియజేయాలని కోరారు.

రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో ద్వితీయ స్థానం



తాను రూపొందించిన ప్రాజెక్టుతో విద్యార్థిని కల్పన

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 8: రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో బంజారానగర్ జడ్పీహెచ్ఎస్ విద్యార్థిని కల్పన ద్వితీయ స్థానంలో నిలిచిందని జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి గురువారం తెలిపారు. గైడ్ టీచర్ ప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో కల్పన సుస్థిర వ్యవసాయం ఉప అంశంలో మల్టీపర్పస్ సోలార్ కిసాన్ రక్షక్ అగ్రికల్చర్ సిస్టం అనే ప్రాజెక్టును రూపొందించింది. రాష్ట్రస్థాయి ప్రదర్శనలో వర్చువల్ పద్ధతిలో పాల్గొని ద్వితీయ స్థానంలో నిలిచింది. కల్పనను జిల్లా కలెక్టర్ రాజర్షిషా, డీఈవో రాధాకిషన్ అభినందించారు.

నవోదయ ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

● ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 7 పరీక్షా కేంద్రాలు
● హాజరుకానున్న 2,161 మంది విద్యార్థులు



సమావేశంలో పాల్గొన్న సూపరింటెండెంట్లు, కేంద్ర పరిశీలకులు

వర్గల్, ఫిబ్రవరి 8: జవహర్ నవోదయ విద్యాలయంలో 2024-2025 విద్యా సంవత్సరంలో 9, 11 తరగతిలోని సీట్ల భర్తీ కోసం ఈ నెల 10న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. అందుకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తయినట్లు నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ రాజేందర్ తెలిపారు. గురువారం పరీక్ష నిర్వహణకు సంబంధించి పవర్ పాయింట్ ద్వారా పరీక్ష కేంద్రాల సూపరిటెండెంట్లకు, కేంద్ర పరిశీలకులకు శిక్షణ ఇచ్చారు. ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా 9వ తరగతిలో ప్రవేశానికి 1,109 మంది, 11వ తరగతిలో ప్రవేశానికి 1,052 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారని తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 7 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. 9వ తరగతి ప్రవేశ పరీక్షకు 4 కేంద్రాలు, 11వ తరగతి ప్రవేశ పరీక్షకు 3 కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ప్రవేశ పరీక్ష గజ్వేల్, ప్రజ్ఞాపూర్‌తో పాటు వర్గల్ జవహర్ నవోదయ విద్యాలయంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. 9వ తరగతి ప్రవేశ పరీక్ష ఉదయం ఉదయం 11.15 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు, 11వ తరగతి ప్రవేశ పరీక్ష ఉదయం 11.00 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు నిర్వహిస్తామన్నారు.

పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్

సిద్దిపేట క్రైం, ఫిబ్రవరి 8 : ఈ నెల 10న నిర్వహించే జవహర్ నవోదయ విద్యాలయ ప్రవేశ పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని పోలీస్ కమిషనర్ బి.అనురాధ తెలిపారు. పరీక్ష సమయంలో పరీక్ష కేంద్రాల నుంచి 500 మీటర్ల వరకు ప్రజలు గుమిగూడ వద్దని, సమీపంలో ఉన్న జిరాక్స్ సెంటర్లు మూసివేయాలని సూచించారు.

జాతీయ స్థాయి రగ్బీ పోటీలకు ఖేడ్ విద్యార్థులు



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

నారాయణఖేడ్, ఫిబ్రవరి 8: జాతీయ స్థాయి రగ్బీ పోటీలకు నారాయణఖేడ్‌లోని ఈ-తక్షిల పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని కరస్పాండెంట్ శరత్ గురువారం ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర స్థాయిలో అండర్ -14 విభాగంలో నిర్వహించిన రగ్బీ పోటీల్లో విద్యార్థులు శ్రీరాం, విలక్షణ, సాయి లక్ష్మి ప్రతిభను కనబరచి గుజరాత్‌లో జరుగనున్న జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. రగ్బీ అసోసియేషన్ సెక్రెటరీ కిష్టయ్య, అధ్యక్షుడు మారుతి, శ్రీనాథ్, తదితరులు విద్యార్థులను అభినందించారు.

సహకార బ్యాంకు టర్నోవర్ రూ.2,500కోట్లు

●డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి



కామన్ సర్వీస్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న చిట్టి దేవేందర్‌రెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

జగదేవ్‌పూర్, ఫిబ్రవరి 8: దశాబ్ద కాలం క్రితం సహకార బ్యాంకు టర్నోవర్ రూ.రెండు కోట్లుగా ఉండేదని, ప్రస్తుతం రూ.2,500కోట్ల టర్నోవర్‌కు చేరుకుందని ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. గురువారం జగదేవ్‌పూర్ మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో సీఎస్‌సీ (కామన్ సర్వీస్ సెంటర్), అలిరాజపేటలో దుకాణాల సముదాయాలను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా చిట్టి దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. పీఏసీఎస్ సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సొసైటీల ద్వారా రైతులకు ఎరువులు అందిస్తున్నామన్నారు. వంటేరు ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతులకు వెన్నుదన్నుగా నిలిచింది మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అని కొనియాడారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, ఎంపీపీ బాలేశంగౌడ్, జడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, కిరణ్‌గౌడ్, కావ్య దర్గయ్య, కవితా శ్రీనివాస్‌రెడ్డి, రంగారెడ్డి, యాదవరెడ్డి, ఉపేందర్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్లు శ్రీనివాస్‌గౌడ్, గుర్రం శ్రీనివాస్, పబ్బా శ్రీహరిగౌడ్, శివలింగం తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించండి

● అతిథి అధ్యాపకుల డిమాండ్

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 8: తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విధులు నిర్వహిస్తున్న అతిథి అధ్యాపకులు డిమాండ్ చేశారు. సంగారెడ్డిలోని ఐబీలో గురువారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో చాలీచాలని వేతనాలతోనే పనిచేశామన్నారు. ఇతర అధ్యాపకుల మాదిరిగానే తాము విధులు నిర్వహించినా న్యాయం జరుగలేదని వాపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా తమకు హైకోర్టు ఉత్తర్వులను అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. సమావేశంలో యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు శ్రీశైలం, సిద్దిపేట, సంగారెడ్డి జిల్లాల అధ్యక్షులు సాయిబాబా, కాసోజు రమేష్ చారి, కార్యదర్శి వెంకటేశ్వర్లు, కోశాధికారి వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

బొల్లారంలో బాల్క సుమన్ దిష్టిబొమ్మ దహనం

జిన్నారం, ఫిబ్రవరి 8: సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా బొల్లారం మున్సిపాలిటీలో గురువారం కాంగ్రెస్ నాయకులు దిష్టిబొమ్మను దహనం చేశారు. కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ చంద్రారెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో బాల్క సుమన్ దిష్టిబొమ్మను ఊరేగించి, దహనం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు గోపాలమ్మ, చంద్రయ్య, నాయకులు వరప్రసాద్‌రెడ్డి, రాజ్‌గోపాల్, శ్రీకాంత్‌రెడ్డి, చంద్రశేఖర్, పరుశరాం పాల్గొన్నారు.

చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

● రజక సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేష్ డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న రజక సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేష్

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 8: చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని రజక సంఘం సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు నాగేష్ డిమాండ్ చేశారు. సంగారెడ్డి పట్టణంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు రాష్ట్రంలో బీసీలకు 9 సీట్లు కేటాయించాలని కోరారు. తెలంగాణ కోసం తన ప్రాణాలను కూడా లెక్కచేయకుండా పోరాడిన బీరయ్యయాదవ్‌కు మెదక్ పార్లమెంట్ టికెట్‌ను బీఆర్ఎస్ కేటాయించాలని కోరారు. ఆయనకు రజక సంఘం సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్ల తీర్మానం చేశారు. బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ మెదక్ ఎంపీ టికెట్‌ను బీరయ్య యాదవ్‌కు ఇస్తే ఆయన విజయానికి సంఘం తరఫున కృషి చేస్తామని తెలిపారు. సమావేశంలో సంఘం జిల్లా సలహాదారు నర్సింలు, నాయకులు రాజు, సాయి, దేవా, శ్రీనివాస్, రాములు, అంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలి



గర్ల్స్ కన్వెన్షన్‌లో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి మమత

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 8: బాలికలు, మహిళల భద్రత కోసం మహిళా చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి మమత డిమాండ్ చేశారు. సంగారెడ్డిలోని రాయల్ జూనియర్ కళాశాలలో గురువారం నిర్వహించిన గర్ల్స్ కన్వెన్షన్‌లో ఆమె మాట్లాడారు. మహిళా అభ్యున్నతి కోసం ఎస్ఎఫ్ఐ అనేక పోరాటాలు చేస్తున్నదన్నారు. విద్యార్థినులు విద్యారంగంతో పాటు రాజకీయాల్లోనూ రాణించాలన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మహిళలను ఆటవస్తువులా చిన్నచూపు చూస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలు సావిత్రీబాయిని స్ఫూర్తిగా తీసుకుని ప్రగతిశీల ఆలోచనలతో అన్ని రంగాల్లో ముందుండాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రమేష్, నాయకులు రవి, కిరణ్ గౌడ్ పాల్గొన్నారు.

డంపింగ్‌యార్డ్ వద్దు

● ప్యారానగర్‌కు మహానగర చెత్త తరలిస్తే ఊరుకోం
● పనులను అడ్డుకున్న గ్రామస్థులు
● జాతీయ రహదారిపై ఆందోళన.. ధర్నా

గుమ్మడిదల, ఫిబ్రవరి 8: హైదరాబాద్ మహానగరంలో సేకరించిన చెత్తను గుమ్మడిదల మండలం నల్లవల్లి గ్రామపంచాయతీ పరిధిలోని ప్యారానగర్ శివారులో డంపింగ్ చేసేందుకు అధికారులు చేపట్టిన పనులను పలు గ్రామాల వారు అడ్డుకున్నారు. ఇక్కడ డంపింగ్ యార్డ్ ఏర్పాటు కోసం అధికారులు అటవీ ప్రాంతంలో రోడ్డు వేసేందుకు గురువారం చెట్లను నరికే పనులు మొదలుపెట్టారు. విషయం తెలుసుకున్న ప్యారానగర్, నల్లవల్లి, కొత్తపల్లి, మంబాపూర్ గ్రామాల వారు వెళ్లి ఈ పనులను అడ్డుకున్నారు. తమ ప్రాంతంలో డంపింగ్ యార్డ్ వద్దంటూ మొరపెట్టుకుంటున్నా.. మొండిగా ఇక్కడే ఏర్పాటు చేస్తున్నారంటూ గురువారం మెదక్-హైదరాబాద్ జాతీయ రహదారిపై గుమ్మడిదల మండలం నల్లవల్లి గ్రామశివారులో పెద్ద ఎత్తున బైఠాయించి ధర్నాకు దిగారు. తాము ఇన్ని రోజులు ఆరోగ్యంగా బతికామని, చెత్త డంపింగ్ వల్ల అనారోగ్యంతోపాటు వ్యవసాయం చేయలేని పరిస్థితి నెలకొంటుందని, పచ్చని వాతావరణంలో ఉండే అటవీ ప్రాంతం సైతం నాశనమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలోనూ డంపింగ్ యార్డు వ్యతిరేకంగా ఆందోళన చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ సర్వే నెంబర్‌లో అన్ని పట్టాభూములేనని, అటవీ.. ప్రభుత్వ భూములు లేవన్నారు. గతంలో ఓ అధికారి తప్పుడు నివేదిక ఇవ్వడంతో డంపింగ్ యార్డ్ సమస్య వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడ డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేస్తే.. ప్రాణాలు పణంగా పెట్టి అయినా అడ్డుకుంటామని హెచ్చరించారు. డంపింగ్ యార్డ్ వద్దంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. గ్రామస్థుల ఆందోళనతో జాతీయ రహదారిపై ఇరువైపులా కిలోమీటర్ మేర వాహనాలు నిలిచి.. ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ఆందోళనకు ఎంపీపీ సద్ది ప్రవీణభాస్కర్‌రెడ్డి, జడ్పీటీసీ సభ్యుడు కుమార్‌గౌడ్, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు ఎండీ హుస్సేన్, ఎంపీటీసీ ప్రభాకర్‌రెడ్డి, సర్పంచ్ దోమడుగు శంకరులు మద్దతు తెలిపారు. తహసీల్దార్ గంగాభవానీ, జిన్నారం సీఐ సుధీర్‌కుమార్, గుమ్మడిదల ఎస్ఐ లక్ష్మారెడ్డిలు వచ్చి గ్రామస్థులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.



డంపింగ్ యార్డు కోసం రోడ్డు వేసేందుకు చెట్లను తొలగించిన దృశ్యం



డంపింగ్‌యార్డు ఏర్పాటుతో వచ్చే సమస్యలను తహసీల్దార్ గంగాభవానికి వివరిస్తున్న జడ్పీటీసీ కుమార్‌గౌడ్

ఫైరింగ్ శిక్షణతో పోలీసులకు ఆత్మవిశ్వాసం

నంగునూరు, ఫిబ్రవరి 8 : పోలీసులకు ఇచ్చే ఫైరింగ్ శిక్షణ వారిలో ఆత్మవిశ్వాసం నింపుతుందని సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధ అన్నారు. గురువారం నంగునూరు మండలం రాజగోపాలపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జిల్లాలో ఉన్న పోలీస్ అధికారులు, సిబ్బందికి నిర్వహించిన వార్షిక ఫైరింగ్ శిక్షణలో ఆమె మాట్లాడారు. ఈ శిక్షణ ద్వారా అధికారులు, సిబ్బంది వ్యూహాత్మకంగా ఆలోచించగలుగుతారని తెలిపారు. రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు పూర్ణచందర్, ధరణి కుమార్, ఆర్ఎస్ఐలు, కార్తీక్, రంజిత్, రోహిత్, సాయి చరణ్ సూచనలు చేశారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ అందె శ్రీనివాసరావు, ఏఆర్ అడిషనల్ డీసీపీ సుభాశ్ చంద్రబోస్, హుస్నాబాద్ ఏసీపీ సతీష్, గజ్వేల్ ఏసీపీ రమేష్, సిద్దిపేట ఏసీపీ సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఫైరింగ్ శిక్షణలో పోలీస్ అధికారులు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రాంరెడ్డి

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

తొగుట, ఫిబ్రవరి 8: ప్రజా ప్రభుత్వం అని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రోటోకాల్‌ను ఉల్లంఘిస్తూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నదని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రాంరెడ్డి మండిపడ్డారు. గురువారం తొగుటలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మంజూరైన అభివృద్ధి పనులను రద్దుచేసి, వాటినే కొత్తగా మంజూరు చేసినట్లు కాంగ్రెస్ నాయకులు శంకుస్థాపనలు చేయడం విడ్డూరంగా ఉన్నదన్నారు. దుబ్బాక ఎమ్మెల్యేకు సమాచారం ఇవ్వకుండా అధికారులు అభివృద్ధి కార్యక్రమాలను చెరుకు శ్రీనివాస్‌రెడ్డితో ఎలా ప్రారంభింపజేస్తున్నారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ కంది రాంరెడ్డి, బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు చిలివేరి మల్లారెడ్డి, యూత్ మండలాధ్యక్షుడు అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

పట్టణాలకు దీటుగా గ్రామాల అభివృద్ధి

- కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి
- రూ.3.33 కోట్లతో అభివృద్ధి పనులకు భూమిపూజ

తొగుట, ఫిబ్రవరి 8: పట్టణాలకు దీటుగా మారుమూల గ్రామాల్లోని పల్లెలనూ అభివృద్ధి చేస్తామని కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. గురువారం మండలంలోని జప్తిలింగారెడ్డిపల్లి, లింగాపూర్, ఎల్.బంజర్‌పల్లి, వెంకట్రావ్‌పేట, చందాపూర్, తొగుట, కాన్గల్, తుక్కాపూర్, ఎల్లారెడ్డిపేట, పెద్దమాసాన్‌పల్లి, మెట్టు, ఘనపూర్ గ్రామాల్లో రూ.1.5 కోట్లతో (జాతీయ ఉపాధిహామీ నిధులు), అదేవిధంగా రూ.2.28 కోట్లతో (స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ కింద) చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఎంపీపీ లతానరేందర్‌రెడ్డితో కలిసి ఆయన భూమి పూజచేసి మాట్లాడారు. దుబ్బాక నియోజకవర్గంలో మాజీ మంత్రి చెరుకు ముత్యంరెడ్డి చేసిన అభివృద్ధి పనులు తప్పా గడిచిన పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క పనీ చేయలేదని మండిపడ్డారు. ముత్యంరెడ్డి ఆశయాల కనుగుణంగా దుబ్బాక నియోజవర్గాన్ని అభివృద్ధిలో పరుగులు పెట్టిస్తామని హామీఇచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల స్పెషలాఫీర్లు శ్రీధర్, శ్రీకాంత్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు అక్కం స్వామి, మాజీ ఎంపీపీ గంట రేణుక రవిందర్, మాజీ వైస్ ఎంపీపీ కూచి మహిపాల్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



లింగాపూర్‌లో ఎంపీపీ లతానరేందర్‌రెడ్డితో కలిసి అభివృద్ధి పనులను ప్రారంభించిన శ్రీనివాస్‌రెడ్డి

భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

మిరుదొడ్డి, ఫిబ్రవరి 8: మాఘమ అమావాస్య జాతరను పురస్కరించుకుని కూడవెల్లి జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం అక్బర్‌పేట-భూంపల్లి మండలం కూడవెల్లి రామలింగేశ్వరాలయ జాతర ఏర్పాట్లను కాంగ్రెస్ కార్యకర్తలతో పర్యవేక్షించారు. భక్తులు స్నానపు గదులను ఏర్పాటు చేయాలని సూచించారు. ఆయన వెంట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటస్వామి, నాయకులు బాలాగౌడ్, అశోక్, సుమలత, స్వామి, నిరంజన్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి ఉన్నారు.

జీవితంపై విరక్తి చెంది వివాహిత ఆత్మహత్య

మద్దూరు, ఫిబ్రవరి 8: ఆరోగ్యం సరిగ్గా లేక.. జీవితంపై విరక్తి చెందిన వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన దూళిమిట్ట మండలం హన్మతండాలోని మహరాజ్‌తండాలో గురువారం చోటు చేసుకున్నది. ఎస్ఐ షేక్ యూనస్ అహ్మద్ అలీ తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన బానోత్ మంజుల(25)కు సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం గొట్టిపర్తి గ్రామంలోని బాపన్‌బాయి తండాకు చెందిన ధరావత్ నరేశ్‌తో మూడేళ్ల క్రితం వివాహం చేశారు. ఆమెకు మానసిక పరిస్థితి బాగా లేకపోవడంతో హైదరాబాద్ ఎర్రగడ్డలోని ఆస్పత్రిలో చికిత్స పొందింది. గత ఐదునెలల క్రితం తల్లిదండ్రులు బుజ్జి, జబ్బర్‌లాల్ గ్రామానికి తీసుకొచ్చారు. అయితే బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. తల్లి బానోత్ బుజ్జి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఐనాపూర్‌లో ద్విచక్ర వాహనం చోరీ

చేర్యాల, ఫిబ్రవరి 8: కొమురవెల్లి గ్రామానికి చెందిన మెతుకు కిష్టయ్య వ్యవసాయబావి సమీపంలో రోడ్డు పక్కన పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాన్ని గురువారం ఉదయం గుర్తుతెలియని ఆగంతకులు అపహరించుకుపోయారు. ఈ మేరకు కిష్టయ్య కొమురవెల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విచారణ చేపట్టారు. ద్విచక్ర వాహనాన్ని అపహరించుకుపోయిన హైదరాబాద్‌కు చెందిన ఇరువురు యువకులను గంటల వ్యవధిలోనే పట్టుకున్నామని ఎస్ఐ నాగరాజు తెలిపారు. వారి నుంచి ద్విచక్ర వాహనాన్ని స్వాధీన పరుచుకున్నామని తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 10 మందికి జరిమానా

సిద్దిపేట క్రైం, ఫిబ్రవరి 8: సిద్దిపేట ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తన సిబ్బందితో ఐదురోజుల నుంచి సిద్దిపేటలోని నర్సాపూర్ చౌరస్తా, ఎంపీడీవో ఆఫీస్ చౌరస్తా, రాజీవ్ రహదారిపై వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ క్రమంలో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 10 మందిని పట్టుకున్నారు. గురువారం వారిని సిద్దిపేట జ్యూడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ వి.శ్రావణి ఎదుట హాజరుపరచగా.. విచారణ చేసి 10 మందికి కలిపి మొత్తం రూ.11 వేల జరిమానా విధించారు.

ఇసుక లారీని పట్టుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు



ఇసుకను అక్రమంగా డంప్ చేస్తున్న లారీ

గజ్వేల్, ఫిబ్రవరి 8: ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న లారీని సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకుని గజ్వేల్ పోలీసులకు అప్పగించారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని రాజీవ్ రహదారి పక్కన ఇసుకను అక్రమంగా డంపు చేస్తున్నారని నమ్మదగిన సమాచారంతో టాస్క్‌ఫోర్స్ అధికారులు తమ సిబ్బందితో కలిసి వెళ్లి లారీని పట్టుకుని, గజ్వేల్ పోలీసులకు అప్పగించారు. ఈ సందర్భంగా టాస్క్‌ఫోర్స్ అధికారులు మాట్లాడుతూ అనుమతి లేకుండా ఇసుక, రేషన్ బియ్యం అక్రమ రవాణా చేసినా, పేకాట, జూదం, గంజాయి ఇతర మత్తు పదార్థాలు విక్రయించినా వెంటనే డయల్-100, టాస్క్‌ఫోర్స్ అధికారులు 8712667447, 8712667446 నెంబర్లకు సమాచారం అందించాలన్నారు.

రైస్‌మిల్లర్‌పై దాడిచేసిన పలువురిపై కేసు

చేర్యాల, ఫిబ్రవరి 8: ధూళిమిట్ట రైస్‌మిల్లు వ్యాపార లావాదేవీల విషయమై చేర్యాల రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నేతి నారాయణపై గురువారం చేర్యాల మండలం కడవేరుగు గ్రామానికి చెందిన పలువురు దాడికి పాల్పడ్డారు. తన కోడలు నవతతో పాటు మరో ఎనిమిది మంది భాగస్వామ్యంతో ఆయన ధూళిమిట్టలో పారాబాయిల్డ్ రైస్‌మిల్లు నెలకొల్పారు. తన కోడలు తరపున నేతి నారాయణ రైస్‌మిల్లు లావాదేవీలు చూసుకుంటున్నాడు. ఏడాదికాలంగా ఇరువురు భాగస్వాములు ఎలసాని సుధాకర్, బెజుగం కొండయ్యతో మిల్లు లావాదేవీల మధ్య విబేధాలు తలెత్తడంతో తగాదాలు కొనసాగుతున్నాయి. ఇదే విషయంలో ఇటీవల మరో భాగస్వామి దుబ్బుడు వెంకటరాంరెడ్డి, ఎలసాని సుధాకర్‌మధ్య వివాదం తలెత్తడంతో చేయిచేసుకునే వరకు దారితీసింది. ఆయా విషయాల పరిణామాల నేపథ్యంలో ఎలసాని సుధాకర్, ఎలసాని భాస్కర్, ఎలసాని నాగరాజు, ఎలసాని స్వామి, మరియాల ప్రవీణ్, మరియాల ఆంజనేయులు, మరియాల సత్తయ్య, మరియాల చంద్రయ్యతో పాటు పలువురు నేతి నారాయణ ఇంటికి వెళ్లి మిల్లు లావాదేవీల విషయమై గొడవకు దిగి ఆయనపై దాడికి పాల్పడ్డారు. ఈ విషయమై నారాయణ చేర్యాల పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నారాయణతో పాటు అతడి కుటుంబీకులను బెదిరించిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ దామోదర్ తెలిపారు.

పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలి



ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి ఎదుట నిరసన తెలుపుతున్న సిబ్బంది

గజ్వేల్, ఫిబ్రవరి 8: గజ్వేల్ ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో పనిచేస్తున్న సిబ్బందికి పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయాలని మెడికల్ అండ్ ఎంప్లాయిస్ ట్రేడ్ హెల్త్ ఔట్‌సోర్సింగ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గురువారం గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట నిరసన తెలిపి.. అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్ సాయికిరణ్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్, శానిటేషన్, సెక్యూరిటీ, పేషెంట్ కేర్ ఉద్యోగులకు మూడునెలల నుంచి జీతాలు ఇవ్వడం లేదన్నారు. వెంటనే వారికి వేతనాలు చెల్లించాలన్నారు. వారితో సిబ్బంది రంగారెడ్డి, రాజు, పద్మ, స్వామి, సుధాకర్ ఉన్నారు.

'మంచినీటి సమస్యను పరిష్కరించాలి'

మిరుదొడ్డి, ఫిబ్రవరి 8: అక్బర్‌పేట-భూంపల్లి మండలం ఖాజీపూర్ గ్రామంలో మంచినీటి సమస్య నెలకొన్నది. మిషన్ భగీరథ నీళ్లు రాకపోవడం మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో గ్రామంలో మంచినీటి ట్యాంకర్‌లో నీటిని సరాఫరా చేస్తున్నారు. అయినా మంచినీటి కోసం తిప్పలు తప్పడం లేదని ప్రజలు వాపోతున్నారు. అధికారులు స్పందించి మిషన్ భగీరథ నీళ్లు వచ్చే విధంగా చూడడంతో పాటు బోరు మోటార్లకు మరమ్మతు చేయించాలని మహిళలు కోరుతున్నారు.

రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తే చర్యలు: ఎస్ఐ

దుబ్బాక, ఫిబ్రవరి 8: రేషన్ బియ్యాన్ని ఎవరైనా అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ గంగరాజు హెచ్చరించారు. బుధవారం రాత్రి దుబ్బాక మండలం తిమ్మాపూర్ గ్రామంలో రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి రైస్‌మిల్లుకు తరలిస్తున్నారనే సమాచారంలో సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోదాలు చేసి 36 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. వాహన డ్రైవర్లు మోతె శ్రీనివాస్, పస్తం వెంకటేష్‌ను అదుపులోకి తీసుకుని పట్టుకున్న బియ్యాన్ని స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

'హరీశ్‌రావును విమర్శించే హక్కు లేదు'

మిరుదొడ్డి, ఫిబ్రవరి 8: మాజీ మంత్రి హరీశ్‌రావును విమర్శించే హక్కు కాంగ్రెస్ నేత మైనంపల్లి హన్మంతరావుకు లేదని తాజా మాజీ సర్పంచుల ఫోరం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తుమ్మల బాల్‌రాజు, వంజరి శ్రీనివాస్, మాజీ ఏఎంసీ ఛైర్మన్ సత్యనారాయణ మండిపడ్డారు. గురువారం మిరుదొడ్డిలో వారు మాట్లాడారు. రెండురోజుల క్రితం మైనంపల్లి కాన్వాయ్‌తో వచ్చి హరీశ్‌రావును విమర్శించడం సిగ్గుచేటన్నారు.

'విద్యారంగానికి 20 శాతం నిధులు కేటాయించాలి'

సిద్దిపేట క్రైం, ఫిబ్రవరి 8: తెలంగాణ బడ్జెట్‌లో విద్యారంగానికి 20 శాతం నిధులు కేటాయించాలని ఏబీవీపీ సిద్దిపేట నగర కార్యదర్శి వర్ధేలు హరీశ్ కోరారు. గురువారం అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో సిద్దిపేటలో మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. గతంలో ఉన్న ప్రభుత్వం విద్యారంగానికి 11 శాతం నిధులు ఉంటే దాన్ని 6 శాతానికి చేసి విద్యార్థులు గొంతు కోశారన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగానికి కనీసం 20 నిధులు కేటాయించాలన్నారు.

'విద్యతోనే సమాజంలో గుర్తింపు'

కొండపాక, ఫిబ్రవరి 8: చదువుకోవడం వల్లనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని కొండపాక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు విఠల్‌నాయక్ అన్నారు. గ్రామానికి చెందిన శ్రీనివాస్‌గౌడ్ తన పుట్టినరోజు సందర్భంగా రూ.25 వేల విలువ గల చేతిరాత పుస్తకాలను గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రఘువర్ధన్‌రెడ్డి, హారతి, రామస్వామి, మహేందర్‌రెడ్డి, శ్రీనివాస్, కనకయ్య, బాల మల్లయ్య, సత్యలక్ష్మి పాల్గొన్నారు.

సమాచారం

హరితహారం అధికారిపై సిబ్బంది దాడి

సిద్దిపేట క్రైం, ఫిబ్రవరి 8: హరితహారం అధికారిపై సిబ్బంది గురువారం దాడిచేశారు. సిద్దిపేట మున్సిపాలిటీ పరిధిలో హరితహారం నోడల్ అధికారిగా సామల ఐలయ్య, మున్సిపాలిటీ కార్యాలయంలో పారిశుధ్య విభాగంలో జవాన్‌గా అంజయ్య విధులు నిర్వహిస్తున్నారు. పట్టణంలో రోడ్డు శుభ్రపరిచే విషయంలో నిర్లక్ష్యం వహించాడని అంజయ్యను అధికారి ప్రశ్నించాడు. దీంతో అంజయ్య హరితహారం అధికారి ఐలయ్య, పారిశుధ్య విభాగం సూపర్‌వైజర్ పాషాపై దాడి చేశాడు. ఈ విషయాన్ని మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

చేర్యాల, ఫిబ్రవరి 8: చేర్యాల పట్టణ శివారు బురాన్‌మియాతోట కాలనీలోని సమ్మక్క-సారలమ్మ గద్దెల ప్రాంగణంలో రూ.5 లక్షలతో చేపట్టనున్న సీసీరోడ్డు నిర్మాణ పనులను మునిసిపల్ ఛైర్‌పర్సన్ అంకుగారి స్వరూపారాణి గురువారం ప్రారంభించారు. మునిసిపల్ వైస్ ఛైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి, మాజీ ఎంపీపీ మేడిశెట్టి శ్రీధర్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పారిశుధ్య పనులు

మద్దూరు, ఫిబ్రవరి 8: ప్రభుత్వ ఆదేశాల మేరకు మద్దూరు, దూళిమిట్ట మండలాల్లోని అన్ని గ్రామాల్లో ప్రత్యేకాధికారులు పారిశుధ్య పనులను కొనసాగిస్తున్నారు. రేబర్తి గ్రామంలో రోడ్లు శుభ్రం చేయడంతో పాటు వాటర్ ట్యాంకు, గోదాం పరిసరాల్లో పెరిగిన పిచ్చి మొక్కలను పంచాయతీ సెక్రటరీ మాదవ్ జాదవ్ ఆధ్వర్యంలో సిబ్బంది తొలగించారు.

'గృహజ్యోతి'కి ఇంటింటి సర్వే

మద్దూరు, ఫిబ్రవరి 8: గృహజ్యోతి పథకానికి సంబంధించి విద్యుత్‌శాఖ అధికారుల ఆదేశాల మేరకు మద్దూరు మండలంలో ఇంటింటి సర్వే చేపట్టారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వినియోగదారుల ఇంటింటికి వెళ్లిన సిబ్బంది రీడింగ్ బిల్లులు తీస్తున్నారు. 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ అమలు చేయనున్నట్లు ప్రకటించిన నేపథ్యంలో విద్యుత్ సిబ్బంది రేషన్‌కార్డుతో పాటు ఆధార్‌కార్డు వివరాలు సేకరిస్తున్నారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

కొండపాక, ఫిబ్రవరి 8: కొండపాక మండలం దుద్దెడ స్వయంభూ ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల చివరి రోజు సందర్భంగా బుధవారం రాత్రి దుద్దెడ ఉన్నత పాఠశాల విద్యార్థులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు గ్రామస్థులను అలరించాయి. ఈ సందర్భంగా ట్రస్టు ప్రతినిధులు విద్యార్థులను తీర్చిదిద్దిన ఉపాధ్యాయులు చంద్రభాను, రజనీలను అభినందించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ కమిటీ సభ్యులు మంచాల శ్రీనివాస్, వడ్లకొండ శ్రీనివాస్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

చిన్నచిన్న తగాదాలతో జీవితాలు నాశనం చేసుకోవద్దు: సీఐ

నంగునూరు, ఫిబ్రవరి 8: చిన్నచిన్న తగాదాలతో జీవితాలు నాశనం చేసుకోవద్దని సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను అన్నారు. బుధవారం రాత్రి నంగునూరు మండలం రాజగోపాలపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఘనపూర్ గ్రామంలో పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో కనువిప్పు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఎస్ఐ మోహన్ రెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనుల్లో నాణ్యత లోపం

- సక్రమంగా రోలింగ్ చేయకపోవడంతో దిగబడుతున్న వాహనాలు



రోలింగ్ సరిగ్గా చేయకపోవడంతో కంకర మిశ్రమంలో దిగబడిన ట్రాక్టర్

చేర్యాల, ఫిబ్రవరి 8: చేర్యాల పట్టణంలో జనగామ-సిద్దిపేట జాతీయ రహదారి విస్తరణ పనులు నాసికరంగా చేపడుతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సంబంధిత అధికారులు పర్యవేక్షించకపోవడంతో కాంట్రాక్టర్ నాణ్యతా ప్రమాణాలకు తిలోదకాలిస్తూ పనులు కొనసాగిస్తున్నారు. సమపాళ్లలో కంకర మిశ్రమం వినియోగించడంతో పాటు రోలింగ్ చేసి వాటర్ క్యూరింగ్ చేపట్టాల్సి ఉన్నా సక్రమంగా నిర్వహించడం లేదు. తద్వారా బీటీ వేయకన్నా ముందే వాహనాలు దిగబడుతున్నాయి. కొన్నిరోజుల క్రితం పట్టణ శివారులోని ఐవోసీ పెట్రోల్ పంప్ సమీపంలో బీటీ వేసిన తరువాత గుంత ఏర్పడటంతో పాటు మల్లికార్జున జిన్నింగ్ మిల్లు ఆవరణలో బీటీ కుంగిపోవడంతో తొలచివేసి కొత్త బీటీ వేశారు. ప్రస్తుతం పట్టణ శివారులోని అయ్యప్ప ఆలయ సమీపంలో చాలారోజుల క్రితం కంకర మిశ్రమం పోసి రోలింగ్ పూర్తిచేసి బీటీ వేయడానికి సిద్ధం చేశారు. అదే ప్రదేశంలో ఓ వైపు బీటీ వేస్తుండగానే గురువారం చిన్నపాటి బరువు కలిగిన ఇటుకలోడుతో కూడిన ట్రాక్టర్ ఒక్కసారిగా దిగబడింది. నాణ్యత విషయంలో సంబంధిత ఎన్‌హెచ్ అధికారులు చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

బాల్క సుమన్ వెంటనే క్షమాపణ చెప్పాలి



చిన్నకోడూరులో బాల్క సుమన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

చిన్నకోడూరు/సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి 8: సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ తక్షణమే క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ నాయకులు మీసం మహేందర్, బత్తిని గణేష్ డిమాండ్ చేశారు. గురువారం చిన్నకోడూరులోని అంబేడ్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ నాయకులు బాల్క సుమన్ దిష్టిబొమ్మను దహనం చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పర్శరాం, మల్లేశం, నాగరాజు, జయంత్, జగన్, అజయ్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు. చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ మాట్లాడేముందు నోరు అదుపులో పెట్టుకోవాలని కాంగ్రెస్ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్ సూచించారు. గురువారం సిద్దిపేటలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డిపై మరోసారి వ్యాఖ్యలు చేస్తే కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బట్టలు ఊడదీసి కొడతారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో నాయకులు తప్పేట శంకర్, గయాజుద్దీన్, రాశాద్, నిశాంత్‌గౌడ్, నజ్జు, ఇమ్రాన్, గోపాల్, కృష్ణారెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్: వంటేరు ప్రతాప్‌రెడ్డి



ప్రమీలకు బీమా చెక్కును అందజేస్తున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

జగదేవ్‌పూర్, ఫిబ్రవరి 8: కార్యకర్తల కుటుంబానికి బీఆర్ఎస్ అండగా ఉంటుందని ఎఫ్‌డీసీ మాజీ ఛైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. మర్కుక్ మండలంలోని పాములపర్తి గ్రామానికి చెందిన పెద్ద బోయిన కిష్టయ్య కొన్నిరోజుల క్రితం నీళ్లలో పడి మృతిచెందాడు. అతనికి బీఆర్ఎస్ సభ్యత్వం ఉండడంతో ప్రమాదబీమా కింద మంజూరైన రూ.2 లక్షలను మృతుడి భార్య ప్రమీలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మర్కుక్ ఎంపీపీ పాండు గౌడ్, జడ్పీటీసీ మంగమ్మ రామచంద్రం, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి, నాచారం ఆలయ మాజీ ఛైర్మన్ హరి పంతులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు. అలాగే జగదేవ్‌పూర్ మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త రాగుల కిష్టయ్య అనారోగ్యంతో మృతిచెందగా.. గురువారం మృతుడి భార్య లలితకు రూ.2 లక్షల ప్రమాద బీమా చెక్కును వంటేరు ప్రతాప్‌రెడ్డి, డీసీసీబీ ఛైర్మన్ చిట్టి దేవేందర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ ఛైర్మన్ ఇంద్రసేనారెడ్డి, ఎంపీపీ బాలేశంగౌడ్, జడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహోన్నత వ్యక్తి ఎన్టీఆర్: టీడీపీ

దుబ్బాక, ఫిబ్రవరి 8: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రజలకు సుపరిపాలన అందించిన మహోన్నత వ్యక్తి మాజీ సీఎం ఎన్టీ రామారావు అని టీడీపీ మెదక్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఇల్లెందుల రమేష్ కొనియాడారు. గురువారం దుబ్బాక బస్టాండ్ వద్ద కార్యకర్తలతో కలిసి ఆయన ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మెదక్ పార్లమెంట్ అధికార ప్రతినిధి రాములు, మున్సిపాలిటీ అధ్యక్షుడు రవి, నాయకులు రాగుల శంకర్‌గౌడ్, భాస్కర్, లక్ష్మణ్, గీత, అంజాగౌడ్, పల్లవి, రేణుక, బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా గుంత



కొమురవెల్లి శివారులో ప్రమాదకరంగా ఏర్పడిన గుంత

చేర్యాల, ఫిబ్రవరి 8: కొమురవెల్లి మండల కేంద్రం శివారులోని నూతన పోలీస్‌స్టేషన్ భవన ఆవరణలో ప్రధాన రహదారిపై కొద్దిరోజుల క్రితం ఏర్పడిన గుంత ప్రమాదకరంగా మారింది. నిత్యం ఈ దారి వెంట ప్రయాణికులు హైదరాబాద్‌కు వెళ్తుండడంతో పాటు మల్లన్న భక్తులు రాకపోకలు సాగిస్తున్నారు. కొద్దిరోజుల క్రితం చిన్నదిగా ఏర్పడిన గుంత.. సమీపంలోని భవనాల మురుగునీరు రోడ్డు పైనుంచి ప్రవహించడంతో పాటు వాహనాల రాకపోకల వల్ల దెబ్బతింటున్నది. మూలమలుపు వద్ద ప్రమాదకరంగా గుంత ఉన్నా అధికారులు ఎలాంటి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టకపోవడం పట్ల భక్తులు, ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి మరమ్మతు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఉపాధిహామీ కూలీలకు వందరోజుల పని దినాలను కల్పించండి

- రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్‌కు డీబీఎఫ్ నేత శంకర్ విన్నపం



పంచాయతీరాజ్ కమిషనర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీబీఎఫ్ నాయకులు

గజ్వేల్/గజ్వేల్ టౌన్, ఫిబ్రవరి 8: ఉపాధిహామీ చట్టం ప్రకారం ప్రతి కూలీ కుటుంబానికి వందరోజుల పని దినాలను కల్పించాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్‌కు డీబీఎఫ్ నాయకులు విన్నవించారు. పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయంలో నూతన కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనితారాంచంద్రన్‌కు డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పీ.శంకర్ పుష్పగుచ్ఛం అందజేసి, వినతిపత్రం సమర్పించారు. అనంతరం కూలీల సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని, టస్నాను తిరిగి పునరుద్ధరించాలని కోరారు. వారితో డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన, నాయకురాలు కవితలు ఉన్నారు.

నా భర్త పేరున ఉన్న ఇంటినే మార్పిడి చేశారు

- మంత్రి సీతక్క ఆదేశాలు అనేది అవాస్తవం

హుస్నాబాద్, ఫిబ్రవరి 8: హుస్నాబాద్ మండలం గాంధీనగర్ గ్రామపంచాయతీ పరిధిలోని కిషన్‌నగర్ ఇంటి విషయంపై మా అత్తగారైన చాతబోయిన మల్లమ్మ చేసిన ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదని ఆమె కోడలు సునీత ఒక ప్రకటనలో తెలిపారు. నా భర్త నరేష్ బతికుండగా కొనుగోలు చేసిన ఇంటినే నా పేరున మార్పిడి చేసుకున్నానని పేర్కొన్నారు. ఈ ఇంటి విషయంపై చాలామార్లు పంచాయతీలు జరిగాయని, ఒక్కగానొక్క కుమారైకు న్యాయం చేయాలని మా అత్తతో పాటు బావలను వేడుకున్నానని, వారు పట్టించుకోకపోవడంతో కోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం ఇంటిని నా పేరున మ్యూటేషన్ చేసుకున్నానని తెలిపింది. ఇందులో మంత్రి సీతక్క ఆదేశాల వల్లే చేశామని వారు చేస్తున్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదన్నారు.

నేడు కోదండరామస్వామి జాతర



ఆలయాన్ని ముస్తాబు చేస్తున్న దృశ్యం

మిరుదొడ్డి, ఫిబ్రవరి 8: మిరుదొడ్డి మండలం అల్వాల గ్రామంలోని కూడవెల్లి వాగు పక్కన వెలిసిన కోదండరామస్వామి జాతర మాఘమ అమవాస్యను పురస్కరించుకుని శుక్రవారం వైభవంగా జరగనున్నది. కూడవెల్లి వాగులో స్నానాలు ఆచరించిన భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటారు. గ్రామంలోని రామాలయంలో ఉత్సవ విగ్రహాలను పల్లకీసేవలో మంగళవాయిద్యాలతో ఆలయానికి తీసుకొస్తారు. జాతరకు వచ్చే భక్తులు ఇబ్బందులు లేకుండా గ్రామపెద్దలు భాస్కరచారి, పోలీస్ రాజు, కిష్టయ్య, దిలీప్ ఏర్పాట్లు పూర్తి చేశారు.

నేరాలపై ఏసీపీ సమీక్ష

హుస్నాబాద్, ఫిబ్రవరి 8: హుస్నాబాద్ పోలీసు డివిజన్ కార్యాలయంలో గురువారం సర్కిల్ పోలీసు అధికారులతో ఏసీపీ సతీష్ నేరాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇందులో నేరాల పురోగతి, దొంగతనాలు అరికట్టేందుకు తీసుకుంటున్న చర్యలు, శాంతిభద్రతల పరిరక్షణ తదితర అంశాలపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో సీఐ ఎర్రల కిరణ్, ఎస్ఐలు మహేశ్, తిరుపతి, వివేక్‌తో పాటు ఇన్వెస్టిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

మైనంపల్లి రాకతో బీఆర్ఎస్ నాయకుల గుండెల్లో భయం

- యూత్ కాంగ్రెస్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి సర్దార్‌ఖాన్

గజ్వేల్, ఫిబ్రవరి 8: సిద్దిపేటకు మైనంపల్లి హనుమంతరావు రాకతో బీఆర్ఎస్ నాయకుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి సర్దార్‌ఖాన్ అన్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని హరిత రెస్టారెంట్‌లో ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు. పదేళ్లుగా సిద్దిపేట జిల్లాలో బీఆర్ఎస్ నాయకులు చేసిన అరాచకాలను, దౌర్జన్యాలను ఎదిరించడానికి మైనంపల్లి సిద్దిపేటకు వచ్చారన్నారు. బీఆర్ఎస్‌లో ఉన్నప్పుడు మైనంపల్లి మంచోడైతే కాంగ్రెస్‌లోకి రాగానే గుండా, ద్రోహీ అయ్యారా అని ప్రశ్నించారు. గజ్వేల్‌లో తెలంగాణ ఉద్యమం కోసం మొదట జెండా పట్టుకుని తన పెన్షన్ డబ్బులతో ఉద్యమాన్ని నడిపించిన వంటేరు నారాయణరెడ్డిని మోసం చేసిన చరిత్ర బీఆర్ఎస్ పార్టీదన్నారు. వారితో సోషల్ మీడియా సిద్దిపేట ఇన్‌చార్జి సుధీర్‌రెడ్డి, నాయకులు అహ్మదీపూర్ బాలాగౌడ్, గణేశ్, మహ్మద్ రైజ్ ఉన్నారు.

సిద్దిపేట నియోజకవర్గ అభివృద్ధికి రూ.కోటి



సమావేశంలో మాట్లాడుతున్న పూజల హరికృష్ణ

సిద్దిపేట టౌన్/నారాయణరావుపేట, ఫిబ్రవరి 8: సిద్దిపేట నియోజకవర్గ అభివృద్ధికి రూ.కోటి నిధులు మంజూరయ్యాయని కాంగ్రెస్ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ తెలిపారు. గురువారం సిద్దిపేట పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఈజీఎస్ నిధుల కింద కోటి రూపాయలు మంజూరు చేసినట్లు, అందుకు కృషిచేసిన ఉమ్మడి మెదక్ జిల్లా మంత్రి కొండా సురేఖకు కృతజ్ఞతలు తెలిపారు. కోటి రూపాయలలో చిన్నకోడూరు మండలంలోని అల్లీపూర్‌కు రూ.10 లక్షలు, సిద్దిపేట రూరల్ మండలంలోని తోర్నాలకు రూ.12 లక్షలు, చిన్నగుండవెల్లికి రూ.13 లక్షలు, సీతారంపల్లికు రూ.14.50 లక్షలు, ఇరుకోడుకు రూ.7.50 లక్షలు, సిద్దిపేట అర్బన్ మండలంలోని తడ్కపల్లికి రూ.13 లక్షలు, నారాయణరావుపేట మండల కేంద్రానికి రూ.12 లక్షలు, నంగునూర్ మండల కేంద్రానికి రూ.20 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొమ్మల యాదగిరి, కలిమొద్దీన్, రాజనరేందర్, మెరుగు రాజు, రాజుబహదూర్, నాయకులు పాల్గొన్నారు. పేదల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం పాటుపడుతున్నదని కాంగ్రెస్ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ అన్నారు. గురువారం నారాయణరావుపేట మండలం గుర్రాలగొంది గ్రామంలో కాంగ్రెస్ జెండాను ఆవిష్కరించి గాంధీ విగ్రహానికి పూలమాలవేశారు. కాంగ్రెస్ అధికారంలోకి ఆరు గ్యారంటీల్లో ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బర్మ రామచంద్రం, ఎస్సీ సెల్ జిల్లా మాజీ అధ్యక్షుడు బొమ్మల యాదగిరి, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజ్‌వీర్ తదితరులు పాల్గొన్నారు.